సాక్షి ప్రకాశం
మంగళవారం । 18 । మార్చి । 2025



తొలిరోజు పకడ్బందీగా..
పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు సోమవారం పకడ్బందీగా నిర్వహించారు. రెగ్యులర్ పరీక్షలు 183 కేంద్రాల్లో, ఓపెన్ స్కూల్ పరీక్షలు 23 కేంద్రాల్లో జరిగాయి. - 8లో..



ఇన్‌ఫార్మర్‌నే ఇరికించారు !
గంజాయి అమ్మేవారిని పట్టుకునేందుకు ఇన్‌ఫార్మర్‌ను పెట్టి చివరికి ఇన్‌ఫార్మర్‌నే ఎక్సైజ్ పోలీసులు కేసులో ఇరికించారని బాధితుని బంధువులు వాపోయారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 29
బుధవారం	సహారి
ఉదయం	గం 4 : 57

న్యూస్‌రీల్

38 మందికి కారుణ్య నియామక పత్రాలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



కారుణ్య నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రభుత్వ సర్వీసులో చేరిన వారు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. కారుణ్య కోటాలో అర్హులైన 38 మందికి సోమవారం గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ తమీమ్‌అన్సారియా నియామక పత్రాలను అందించారు. ప్రభుత్వ సర్వీస్‌లోకి వస్తున్నందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. వత్తిపరమైన నైపుణ్యం పెంచుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, డీఆర్వో బి.చిన ఓబులేసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పి.భానుసాయి

ఒంగోలు: ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పి.భానుసాయిని బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఒంగోలులోనే విధులు నిర్వహిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన షేక్ రోషన్ ఒంగోలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన యర్రం షాలినీరెడ్డి ఒంగోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. గిద్దలూరు నుంచి జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైన షేక్ ఖాజా రెహ్మాన్‌ను పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు.

సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతులు



ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ, కమిటీ సభ్యులు

ఒంగోలు టౌన్: జిల్లా సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్–3లకు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ)గా పదోన్నతులు కల్పించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. పదోన్నతి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న డీఎంహెచ్ఓ డా.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు నాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పని చేస్తున్న 210 మందికి పదోన్నతులు కల్పించారు. పదోన్నతి లభించిన ఏఎన్ఎంలు వెంటనే వారికి కేటాయించి ప్రదేశంలో బాధ్యతలు స్వీకరించి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఏవో గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్, సీనియర్ సహాయకులు రాజేశ్వరి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ముండ్లమూరు (దర్శి): ఈతకు వెళ్లి మండలంలోని ఉల్లగల్లు గ్రామానికి చెందిన కోడిగ రమేష్ కుమారుడు పవన్‌కుమార్ (10) విజయవాడ కృష్ణా నదిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పవన్ విజయవాడలో తన తాత ఇంట్లో ఉంటూ అక్కడ ఓ స్కూల్లో చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో ఈత కొట్టేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కృష్ణా నదిలోకి వెళ్లాడు. ఇద్దరు మాత్రమే ఇంటికి వచ్చారు. పవన్‌కుమార్ ఇంటికి రాకపోవడంతో తమ పిల్లవాడు ఏడని ఆ ఇద్దరినీ అడుగగా నదిలో ఈతకు వెళ్లి మునిగి బయటకు రాలేదని చెప్పారు. దీంతో పిల్లవాడిని మునిగిన చోట వెళ్లి వెతకగా మృతదేహం కనిపించింది. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

దిక్కులు చూస్తూ..
ప్రదక్షిణలు చేస్తూ!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. భూ ఆక్రమణలు, కబ్జాలు, భూముల రిజిస్ట్రేషన్‌లో అవకతవకలు, అవినీతి, అధికారుల వేధింపులు, రాజకీయ నాయకుల కక్షసాధింపు చర్యలతో ప్రజలు విసిగివేసారి పోతున్నారు. న్యాయం కోసం స్థానిక అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో ఎవరికి చెప్పుకుంటే న్యాయం జరుగుతుందో తెలియక దిక్కులు చూస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వారిని 'సాక్షి' పలకరించింది. వారి సమస్యలను తెలుసుకుంది.

9 ఏళ్లుగా తీసుకుంటున్న పింఛన్ ఆపేశారు



నా పేరు పఠాన్ జిలానీ ఖాన్. మాది గిద్దలూరు. నాకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పక్షవాతంతో బాధపడుతున్నాను. 9 ఏళ్లుగా వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సదరం సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. సీకేడీ పింఛన్ లబ్ధిదారులకు గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో ఒంగోలు జీజీహెచ్‌లో రెండు సార్లు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు. నవంబర్‌లో హాజరయ్యాను. ఆరోగ్యం బాగాలేకపోవడంతో డిసెంబర్‌లో హాజరుకాలేకపోయాను. జనవరి నుంచి నాకు పింఛన్ ఇవ్వకుండా ఆపేశారు. ఎందుకు ఆపేశారో నాకు తెలియదు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అధికారులను కలిస్తే నా పింఛన్‌ను హోల్డ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు. కొత్తగా మళ్లీ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పారు. 9 ఏళ్లుగా తీసుకుంటున్న పింఛన్‌ను ఒక్క మాట కూడా చెప్పకుండా తీసేయడం దారుణం.



- ప్రజా సమస్యల పరిష్కార వేదిక చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- నెలల తరబడి కలెక్టర్ కార్యాలయానికి బాధితులు
- గత 9 నెలల్లో 35,793 దరఖాస్తులు
- పలుకుబడి ఉంటే క్షణాల్లో పరిష్కారం
- అధికార పార్టీ నేతలు చెబితే ఓకే
- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు
- వలంటీర్లు ఉన్నప్పుడు ఇంటి దగ్గర కూర్చున్నా కొన్ని పరిష్కారమయ్యేవంటున్న లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్/ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలు పెరిగిపోయాయి. 9 నెలల కాలంలో 35,793 ఫిర్యాదులు రాగా వాటిలో ఎన్నిటికి పరిష్కారం చూపారో అధికారిక లెక్కలు బహిర్గతం చేయడం లేదు. వచ్చిన ఫిర్యాదుల్లో ఒక్క రెవెన్యూ శాఖకు సంబంధించి 21,466 దరఖాస్తులు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. దాని తరువాత సర్వే సెటిల్ మెంట్స్, ల్యాండ్ రికార్డుల శాఖ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ శాఖకు సంబంధించి 10,263 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మళ్లీ మళ్లీ ఫిర్యాదులు చేసుకున్న వారు 821 మంది ఉన్నారు. వీరిలో ఒక్క రెవెన్యూలోనే 419 మంది ఫిర్యాదులు చేశారు. పోనీ ఈ 419 మందికైనా సమస్య పరిష్కారమైందా అంటే అదీలేదు. అందులో ఇప్పటికీ 94 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం 275 ఫిర్యాదులు మాత్రమే పరిష్కారం అయినట్లు స్వయంగా అధికారులే చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనేది ఒక ప్రహసంలా సాగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఇక్కడకు వచ్చి జిల్లా అధికారులకు సమస్యలు చెప్పుకుంటే పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం వందలాది మంది వస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదు. రాజకీయ పలుబడి ఉంటే చాలు నిబంధనలను సైతం పట్టించుకోకుండా వారికి పనులు జరిగిపోతున్నాయి. దాంతో జిల్లాలో రోజు రోజుకూ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది.

అధికార పార్టీ నాయకుల జోక్యం

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల జోక్యం మితిమీరుతోందని జోరుగా ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఒక కీలక నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనులను పచ్చ తమ్ముళ్లకు కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా దానికో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు సమాచారం. పనినిబట్టి రూ.10 నుంచి రూ.25 వేలు బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారని సమాచారం. దాంతో కొంతమంది అధికారులు సైతం పచ్చ తమ్ముళ్లతో కుమ్మక్కయి రెండు చేతులా సంపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాంతో కలెక్టర్ దగ్గర నుంచి ఆదేశాలు వచ్చినా మండల స్థాయి అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒక వేళ ఎవరైనా జిల్లా స్థాయి అధికారులు ఫోన్ చేసి ఫలానా పని ఎందుకు చేయలేదని అడిగితే స్థానిక ఎమ్మెల్యే పేరు చెబుతుండడంతో మాకెందుకులే ఈ తలనొప్పులు అని సదరు అధికారులు మిన్నకుండిపోతున్నారు. పశ్చిమ ప్రకాశంలోని ఒక ఎమ్మెల్యే తమ్ముడే అన్నీ ప్రభుత్వ కార్యాలయాల వ్యవహారాలను చూస్తున్నారు. మరో నియోజకవర్గంలో ఇన్‌చార్జి బావమరిది పనులను చక్కబెడుతున్నట్లు సమాచారం.

భయంతో ఫిర్యాదులు చేయడం లేదు...

భూ కబ్జాలు, రాజకీయ నాయకుల వేధింపుల గురించి ఫిర్యాదు చేయడానికి జిల్లావాసులు భయపడిపోతున్నారు. ఒంగోలు నగరంలో ఒక వృద్ధ దంపతుల ఇంటిని అద్దెకు తీసుకున్న ఒక రాజకీయ నాయకుడు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించాడు. అతడికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసేందుకు ధైర్యం చాలని ఆ దంపతులు మౌనంగా రోదిస్తున్నారు. సుమారు రూ.10 కోట్లు విలువైన ఆ ఆస్తి ప్రస్తుతం రాజకీయ నాయకుడి కబ్జాలో ఉండడం గమనార్హం. జిల్లాలో ఇలాంటి కబ్జాలు ఎన్నో ఉన్నాయి. ఇక చిరుద్యోగుల వేధింపుల లెక్కేలేదు. పెద్దారవీడు మండలంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాయిస్ ఇచ్చిన మిర్చి రైతు పంటను టీడీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. దాంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్న జనం...

గిద్దలూరు, సంతనూతలపాడు, ఒంగోలుతో సహా జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో అనేక మంది పింఛన్లు తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విరిగిపోయిన కాలుకు చికిత్స చేయించుకునేందుకు వెళ్లడమే నేరం అన్నట్లు ఓ వృద్ధురాలి పింఛన్ తొలగించారు. ఆరోగ్యం బాగాలేక పోవడంతో రీ అసెస్‌మెంట్‌కు హాజరుకాలేక పోయిన పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి పింఛన్ అన్యాయంగా తీసేశారు. ఇదే గత ప్రభుత్వంలో అయితే వలంటీర్లు ఇంటి దగ్గరకు పింఛన్లు తీసుకొని వచ్చి ఇచ్చి వెళ్లేవారు. ఏదైనా సమస్య ఉంటే దగ్గరుండి పరిష్కరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్దాక్షిణ్యంగా పింఛన్లు తొలగించడమే కాకుండా వాటిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు ఇచ్చినట్లుగా తప్పుడు ప్రచారం చేయడం పట్ల ప్రజలు మండిపోతున్నారు.

గ్రీవెన్స్‌కు హాజరైన అర్జీదారులు



శాఖల వారీగా ఫిర్యాదులు..

శాఖ	ఫిర్యాదులు
రెవెన్యూ	21,466
సర్వే సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డుల శాఖ	10,263
పంచాయతీరాజ్	1359
మున్సిపల్	780
దేవదాయశాఖ	123
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్:	187
సివిల్ సప్లయ్స్	570
ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్స్:	270
రూరల్ వాటర్ సప్లయ్	171
రూరల్ డెవలప్‌మెంట్	140
రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్	140
ఎంప్లాయిమెంట్	121

కానిస్టేబుల్ మీద ఫిర్యాదు చేస్తే సస్పెండ్ చేశారు



నా పేరు కె.రమేష్. మాది ఉప్పుగుండూరు గ్రామంలో మాదిగపల్లె. హోం గార్డుగా చేస్తున్నాను. ఒంగోలు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసే కేవీ సుబ్బయ్య మా ఊర్లో పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ విషయంపై పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే తీసుకోలేదు. వారి సూచనల మేరకు ఆ తరువాత కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశా. నేటి వరకు 10 సార్లు ఫిర్యాదులు చేసినా తగిన చర్యలు తీసుకోలేదు. కానీ నేను హెడ్ కానిస్టేబుల్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశానని విధుల నుంచి సస్పెండ్ చేశారు. నన్ను ఆర్థికంగా దెబ్బ తీయడమే కాకుండా పల్లెలో తనకు ఎదురు మాట్లాడేవారిని బెదిరింపులకు గురి చేస్తున్నాడు. 'నాకు పోలీసు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయి.. నన్నెవరూ ఏమీ చేయలేరంటూ' రెచ్చిపోతున్నాడు. నాకు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలి.

నకిలీ పత్రాలతో ఆటో అమ్మి మోసం చేశారు...



నా పేరు షేక్ షంషాద్. ఒంగోలు నగరంలోని రంగుతోటలో నివాసం ఉంటున్నా. కుటుంబ పోషణ నిమిత్తం నేను, నా భర్త కలిసి షేక్.కాలేషా అనే అతడి వద్ద సెకండ్ హ్యాండ్‌లో రూ.1.80 లక్షలకు ఆటో కొనుగోలు చేశాం. నెలకు రూ. 6900 చొప్పున 8 నెలల కిస్తీ కట్టిన తరువాత నా పేరు మీద ఆటో ట్రాన్స్‌ఫర్ చేసేలా అంగీకారం చేసుకున్నాం. డబ్బులు కట్టిన తరువాత కాగితాలు ట్రాన్స్‌ఫర్ చేయమంటే ఆటో అమ్మిన వ్యక్తి మృతి చెందారని అబద్ధాలు చెప్పారు. 4 నెలల్లో మొత్తం డబ్బులు చెల్లిస్తే ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మబలికారు. డబ్బులు మొత్తం కట్టాక నకిలీ పత్రాలు సృష్టించి ఇచ్చారు. తర్వాత కొన్ని రోజులకే ఆటోను ఆర్టీఓ పట్టుకొని కేసు పెట్టారు. ఆటో తీసుకొని నేను కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడితే సమాధానం చెప్పకపోగా నీ ఇష్టమొచ్చింది చేసుకో...నయాపైసా ఇవ్వను అంటూ కాలేషా బెదిరిస్తున్నాడు. 4 నెలలుగా బండి ఆగిపోయింది. కుటుంబం నడవడం కష్టంగా ఉంది.

తహసీల్దార్ కసురుకుంటున్నారు..



నా పేరు గూడా ధనలక్ష్మి. మాది పీసీపల్లి మండలం తురకపల్లి గ్రామం. నాన్న వెంకట పుల్లారెడ్డి బొరుగుల బట్టీ నిర్వహిస్తుంటారు. అమ్మ చిన్నమ్మ గృహిణి. మా నాన్న కష్టపడి పైసా పైసా కూడ బెట్టి 1996వ సంవత్సరంలో 20 సెంట్ల పొలం కొన్నారు. అప్పట్లో రిజిస్టర్ డాక్యుమెంట్లు ఆన్‌లైన్ కాలేదు. ఆ విషయం గురించి మాకు అవగాహన కూడా లేదు. దాన్ని అడ్డం పెట్టుకొని మాచవరం గ్రామానికి చెందిన నూరసాని నరసారెడ్డి, బోడా రవిచంద్రా రెడ్డి, మార వెంకటేశ్వర్లు మా స్థలాన్ని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించారు. ఈ విషయంలో మండల సర్వేయర్ దగ్గరకు వెళితే మీరు పొజిషన్‌లో లేరంటూ దురుసుగా మాట్లాడుతున్నాడు. తహసీల్దార్ దగ్గరకు వెళితే కసురుకుంటున్నారు. 9 నెలలుగా తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాను. కలెక్టర్ ఆఫీసులో రెండు సార్లు ఫిర్యాదు చేశాను. మళ్లీ ఈ రోజు రమ్మంటే వచ్చాను. మాది నిరుపేద కుటుంబం. ప్రభుత్వమే న్యాయం చేయాలి.

అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలి

● కలెక్టరు తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ:

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు సహేతుక, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతి, కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి నివాళులు



వైవీ పిచ్చమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి దంపతులు, వైవీ సోదరి శచీదేవి



నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, వైవీ భద్రారెడ్డి

ఒంగోలు సిటీ:

రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలక మండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఒంగోలులోని వైవీ సుబ్బారెడ్డి స్వగ్రహంలో ఉంచిన ఆమె భౌతిక కాయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, వెల్లంపల్లి శ్రీనివాసులు, కాకాని గోవర్ధన్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాస రెడ్డి, జంకె వెంకటరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, కె.నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబు, టీజేఆర్.సుధాకరబాబు, ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కాకుమాను రాజశేఖర్, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌లు మాదాసి వెంకయ్య, వై.ఎం.ప్రసాద్‌రెడ్డి ఉన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. పిచ్చమ్మ అంత్యక్రియలు మేదరమెట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించనున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం పిచ్చమ్మ అంత్యక్రియల్లో పాల్గొననున్నారు.



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, తాటిపర్తి చంద్రశేఖర్, ఆదిమూలపు సురేష్, కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, జంకె వెంకటరెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, కాకుమాను, వైఎం ప్రసాద్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న టీజేఆర్ సుధాకర్‌బాబు, కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

పెద్దదోర్నాలలో చెయిన్ స్నాచింగ్


గొలుసు లాక్కుని పరిగెడుతూ సీసీ కెమెరాకి చిక్కిన నిందితుడు

పెద్దదోర్నాల: మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన పెద్దదోర్నాలలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక వెచ్చా వెంకటసుబ్బయ్యనగర్ రెండో లైన్‌లో చీదెళ్ల లాలు, చీదెళ్ల శ్వేత దంపతులు నివాసముంటున్నారు. చీదెళ్ల శ్వేత మధ్యాహ్న సమయంలో ఆరుబయట నిలబడి పొరుగింటివారితో మాట్లాడుతోంది. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు శ్వేత మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు మండల కేంద్రంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గొలుసు చోరీ చేసిన యువకుడు లైట్ నీలిరంగు ప్యాంటు, ముదురు నీలిరంగు షర్ట్, నలుపు రంగు టోపీ ధరించి మొహానికి గుడ్డ కట్టుకుని ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 7989244381 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆస్తి తీసుకుని కొడుకు గెంటేశాడు

- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వృద్ధుడి వినతి


అర్జీ రసీదును చూపుతున్న కోటయ్య

మార్కాపురం: వృద్ధాప్యంలో ఉన్న తండ్రికి కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకు.. ఆస్తి రాయించుకుని ఇంటి నుంచి బయటకు గెంటేశాడు. దీంతో న్యాయం కోసం ఆ వృద్ధుడు సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌ను ఆశ్రయించారు. వివరాలు.. పుల్లలచెరువు మండలం చాపలమడుగు పంచాయతీలోని కొత్తపల్లికి చెందిన లింగం కోటయ్యకు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల ఆయన భార్య మృతి చెందింది. ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్న ఆయన వద్ద ఉన్న ఆస్తిని ఒక కొడుకు రాయించుకుని వెళ్లగొట్టాడు. గత్యంతరం లేని స్థితిలో కూతురు వద్ద ఉంటున్నాడు. ఇటీవల కుమారుని వద్దకు వెళ్లగా తన ఇంటికి రావద్దని హెచ్చరించాడని సబ్ కలెక్టర్ ఎదుట వాపోయారు. పొలం అమ్ముకుంటానంటే 'నువ్వు అమ్మితే ఊర్లో ఎవరు కొంటారో చూస్తా' అంటూ కుమారుడు బెదిరించాడని, పూట గడవడం లేదని, చావే శరణ్యమని ఆవేదన వెలిబుచ్చారు. తమరే న్యాయం చేయాలంటూ సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తొలిరోజు పకడ్బందీగా..

ఒంగోలు సిటీ/సాక్షి నెట్‌వర్క్: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 183 కేంద్రాల్లో రెగ్యులర్ పరీక్షలు, 23 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ టెన్త్ తెలుగు పరీక్షకు మొదటి రోజు 29,637 మందికిగాను 488 మంది, ఓపెన్ స్కూల్ హిందీ పరీక్షకు 19 మందికిగాను 10 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలులోని రామ్‌నగర్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు.


ఒంగోలు లాయర్‌పేట సాయి మందిరంలో విద్యార్థుల పూజలు


ఒంగోలు రామ్‌నగర్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించుకుని తల్లితో కలిసి ఒంగోలు పీవీఆర్ బాలికల హైస్కూల్ సెంటర్‌కు చేరుకున్న విద్యార్థి


ఒంగోలు పీవీఆర్ హైస్కూల్లో పరీక్షకు హాజరైన విద్యార్థులు


మద్దిపాడులో పరీక్షకు హాజరైన టెన్త్ విద్యార్థులు


ఒంగోలులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


ఒంగోలు : విద్యార్థులకు పెన్ ఇచ్చి ఆల్ ది బెస్ట్ చెబుతున్న మహిళా కానిస్టేబుల్


ఒంగోలు : కుమార్తెలకు ధైర్యం చెబుతున్న తల్లులు


హనుమంతునిపాడులో..


ముండ్లమూరులో..

ఇన్‌ఫార్మర్‌నే ఇరికించారు!

- గంజాయి వ్యవహారంలో ట్విస్ట్
- ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- 100 గ్రాముల గంజాయి స్వాధీనం
- ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయిన ఒక నిందితుడు
- వేర్వేరు వాదనలు వినిపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు, బాధితులు


నిందితుడితో ఎక్సైజ్ సీఐ శివకుమారి

సింగరాయకొండ: గంజాయి అమ్మేవారిని పట్టుకునేందుకు ఇన్‌ఫార్మర్‌ను రంగంలోకి దించి చివరికి ఆ ఇన్‌ఫార్మర్‌నే ఎక్సైజ్ పోలీసులు కేసులో ఇరికించారని ఇన్‌ఫార్మర్ బంధువులు ఆరోపిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు మాత్రం అసలైన నిందితులినే పట్టుకున్నామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, నిందితుల్లో ఒకరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకుని పారిపోయిన సంఘటన చర్చనీయాంశమైంది. పూర్తి వివరాల ప్రకారం.. గత శనివారం స్థానిక బుంగబావి సెంటర్‌లో నివసిస్తున్న హరిశ్చంద్ర అనే యువకుడిని నీకు మద్యం సీసా ఇస్తా..నాకు గంజాయి కావాలంటూ ఎక్సైజ్ కానిస్టేబుల్ నమ్మబలికాడు. గంజాయి తీసుకురావాలంటూ అతనికి రూ.9 వేలు డబ్బులిచ్చాడు. గంజాయి తెచ్చిస్తే మద్యం సీసా ఉచితంగా వస్తుందని ఆశపడిన హరిశ్చంద్ర తన స్నేహితుడైన బాలయోగినగర్‌కు చెందిన బల్సూరి శివకు విషయం చెప్పి గంజాయి కావాలని అడిగాడు. దీంతో శివ పాతసింగరాయకొండ పంచాయతీ గుజ్జుల యలమందారెడ్డినగర్‌లో గంజాయి అమ్ముతున్న మహిళ వద్దకు వెళ్లి రూ.6 వేలిచ్చి 100 గ్రాముల గంజాయి ప్యాకెట్ తీసుకొచ్చాడు. ఇద్దరూ కలిసి ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు గంజాయి ప్యాకెట్ ఇచ్చారు. దీంతో ఆ కానిస్టేబుల్ వారిద్దరినీ పట్టుకుని మీరు గంజాయి అమ్ముతారా అని అడగడంతో.. మేము పలానాచోట గంజాయి తెచ్చామని వారు చెప్పారు. వారిద్దరినీ తీసుకుని గంజాయి అమ్మే మహిళ వద్దకు వెళ్లగా, తాను గంజాయి అమ్మడం లేదని, హరిశ్చంద్ర వద్ద తీసుకున్న రూ.6 వేలను కానిస్టేబుల్‌కు ఆ మహిళ తిరిగిచ్చింది. దీంతో కానిస్టేబుల్ హరిశ్చంద్ర, శివలను అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఆదివారం సెలవు కావడంతో కోర్టులో హాజరుపరచడం వీలుపడక సోమవారం వారిద్దరినీ కోర్టులో హాజరుపరిచేందుకు స్నానం చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ఎక్సైజ్ పోలీసులను ఏమార్చి స్టేషన్ నుంచి శివ పరారయ్యాడు. దీంతో నిందితుల్లో ఒకరే దొరికారని, మరొకరి కోసం గాలిస్తున్నామని ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఎక్సైజ్ సీఐ శివకుమారిని వివరణ కోరగా, తమకు అందిన సమాచారంతో స్థానిక కందుకూరు రోడ్డులోని చేపల మార్కెట్ వద్ద తనిఖీలు చేస్తుండగా, అనుమానాస్పదంగా ఉన్న హరిశ్చంద్రను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద 100 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అతను బల్సూరి శివ వద్ద గంజాయి కొన్నానని చెప్పడంతో శివ కోసం గాలిస్తున్నామన్నారు. హరిశ్చంద్రపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు. అయితే, ఈ కేసులో హరిశ్చంద్రను ఇన్‌ఫార్మర్‌గా వాడుకుని అన్యాయంగా ఇరికించారంటూ అతని బంధువులు ఆరోపిస్తున్నారు. స్థానికులు మాత్రం గుజ్జుల యలమందారెడ్డి నగర్‌లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని, ఆ విషయం పోలీసులకు తెలీకుండా ఉందా అని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దుతామని ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో అమలు కావడం లేదని, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జనసేన మహిళా నాయకుల రౌడీయిజం

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రవణమ్మపై దాడి

ఒంగోలు టౌన్: జనసేన మహిళా నాయకులు రౌడీయిజానికి పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మపై దాడి చేశారు. దారికాచి మరీ సినిమా స్టైల్లో రౌండప్ చేశారు. రవణమ్మ తెలిపిన వివరాల ప్రకారం... జనసేన ఆవిర్భావ సభలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రెచ్చిపోయి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శలు చేయడం తెలిసిందే. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలినేని తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు బాలినేని విమర్శలను తీవ్రంగా ఖండించారు. వారిలో భూమిరెడ్డి రవణమ్మ కూడా బాలినేని తీరును తప్పుబట్టారు. దీన్ని జీర్ణించుకోలేని బాలినేని వర్గానికి చెందిన జనసేన మహిళా నాయకులు రవణమ్మ మీద కక్ష పెంచుకున్నారు. సోమవారం ఉదయం రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ మరణించగా రవణమ్మ వెళ్లి నివాళులర్పించారు. తిరిగి ఇంటికి వెళుతుండగా స్థానిక వీఐపీ రోడ్డులో అప్పటికే దారికాచిన బాలినేని వర్గానికి చెందిన జనసేన మహిళా నాయకులు పురిమి ప్రభావతి, హైమావతి, మరికొందరు అడ్డగించారు. మా నాయకుడు బాలినేనిని విమర్శిస్తావా, నీ సంగతి తేలుస్తామంటూ బెదిరింపులకు దిగారు. ఒక్కసారిగా చుట్టుముట్టి రవణమ్మపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రవణమ్మకు కనిపించని గాయాలయ్యాయి. స్థానికులు వచ్చి అడ్డుకోవడంతో రవణమ్మ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన నగరంలో సంచలనం సృష్టించింది. రవణమ్మను చికిత్స కోసం స్థానిక జీజీహెచ్‌కి తరలించారు.

సత్తా చాటిన వైఎస్సార్ జిల్లా గిత్తలు

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవ గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ ఎడ్ల బండలాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన గిత్తలు సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటుపల్లెకు చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దు 3644 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,11,111, మరో జత ఎద్దు 3429 అడుగులు లాగి రెండో బహుమతి రూ.77,777 దక్కించుకున్నాయి. నంద్యాలకు చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎద్దు 3325 అడుగులు లాగి మూడో బహుమతి రూ.55,555, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పి.వీరస్వామిచౌదరి ఎద్దు 2988 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.33.333, నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన గొటిక దినేష్‌రెడ్డి ఎద్దు 2,845 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.22.222, గడివేములకు చెందిన సయ్యద్ కలామ్‌బాషా ఎద్దు 2,526 అడుగులు లాగి ఆరో బహుమతి రూ.11,111 గెలుపొందాయి. ఈ పోటీల్లో మొత్తం 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎడ్ల పోటీల్లో పాల్గొన్న ఎద్దు బండలాగుతూ హఠాత్తుగా కింద పడిపోయి మృతి చెందింది. తర్లుపాడు మండలం బొడిచెర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎద్దు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చాయి. బండ లాగుతున్న క్రమంలో ఎద్దు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. దీంతో గ్రామస్తులంతా చందాలు వేసుకుని రూ.3.60 లక్షలను ఎద్దు యజమానికి అందజేశారు.

చైనాలో గ్రానైట్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న బూచేపల్లి


గ్రానైట్ ఎగ్జిబిషన్‌లో బూచేపల్లి శివప్రసాదరెడ్డి, గ్రానైట్ పరిశ్రమల యజమానులు

చీమకుర్తి రూరల్: అంతర్జాతీయస్థాయిలో చైనాలో సోమవారం నిర్వహించిన గ్రానైట్ ఎగ్జిబిషన్ (స్టోనా)లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. గ్రానైట్ పరిశ్రమలకు సంబంధించిన మిషనరీస్‌ను పరిశీలించారు. బూచేపల్లి రిలాసరెడ్డి, కృష్ణపాటి శేఖర్‌రెడ్డి, బి.ప్రసాదరెడ్డి, బి.కృష్ణారెడ్డి, లక్కు వెంకటేశ్వరరెడ్డి, బాపతు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ సభ్యుడిగా నబీ


దూదేకుల నబీ

తర్లుపాడు: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ అసెస్‌మెంట్ సెల్‌కు తర్లుపాడు మండలం కారుమానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దూదేకుల నబీని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ డి.సుజాత తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీకి ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్ ఏర్పాటుకు ఈ నెల 6న విజయవాడలో నిర్వహించిన రాత పరీక్షలో టాప్ 5లో నిలిచిన ఉపాధ్యాయులకు విడివిడిగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారని వివరించారు. ఏడాదిపాటు అమరావతిలోని ఎస్‌సీఈఆర్‌టీలో పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని నబీ తెలిపారు. ఈ సందర్భంగా నబీని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం


మహిళ మృతదేహం

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామ పరిధిలో గల అటవీ ప్రాంతంలో సోమవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్సై ఎం.శివ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే దొనకొండ నుంచి నాయుడుపాలెం, వీవైకాలనీకి వెళ్లే మట్టిరోడ్డులో పొట్లపాడు పరిధిలోని అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం ఉందని గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు త్రిపురాంతకం సీఐ జి.అస్సాన్, దొనకొండ, కురిచేడు ఎస్సైలు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందని, మూడునాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని అంచనా వేశారు. చిలకపచ్చ రంగు చీర, వంకాయ రంగు లంగా, జాకెట్, కాళ్లకు చెప్పులు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్ కారణంగా మృతి చెంది ఉంటుందని సీఐ అస్సాన్ తెలిపారు. మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి సమాచారం తెలిసిన వారు ఎస్సై ఎం.శివ (9121102163)ను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి బంకు కూల్చివేత

- కూటమి నాయకులకు తలొగ్గిన పోలీసులు
- దుకాణం పెట్టుకోమని చెప్పి వెనువెంటనే కూల్చివేత
- గంగపాలెంలో రగులుతున్న వర్గపోరు


బంకును ధ్వంసం చేస్తున్న జేసీబీని అడ్డుకుంటున్న బాధితుడి బంధువు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ నాయకుడి బంకును కూల్చివేయించిన పోలీసులు గ్రామంలో శాంతి, భద్రతల పరిస్థితిని పక్కనపెట్టి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సంఘటన యర్రగొండపాలెం మండలంలోని గంగపాలెంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గంగపాలెంకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాజుల వెంకటనారాయణ తన ముత్తాతల కాలం నుంచి గ్రామ కంఠం స్థలంలో గడ్డి వామి, దిబ్బ ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్ల క్రితం ఆ స్థలానికి సమీపంలో రేకులతో బంకును ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారం చేసుకుంటున్నాడు. ఆ ప్రాంతంలోనే ఉన్న గంగమ్మ గుడిని గ్రామస్తులు అభివృద్ధి చేస్తూ వచ్చారు. వెంకట నారాయణకు వారసత్వంగా వస్తున్న గడ్డివామి దొడ్డి, పేడ దిబ్బ, దుకాణం ఎవరికీ అభ్యంతరం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వెంకట నారాయణను ఇబ్బంది పెట్టేందుకు టీడీపీ నేతలు సమయం కోసం వేచి చూశారు. గత నెల 10వ తేదీన గంగమ్మ తిరునాళ్ల కావడంతో అంతకంటే ముందే కుట్రకు తెరతీశారు. అమ్మవారి తేరు తిరగడానికి అడ్డుగా ఉందంటూ బంకును తొలగించాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు గత నెల 6వ తేదీన పోలీసులు వెళ్లి బంకును పక్కకు నెట్టించారు. ఆ తర్వాత గ్రామానికి చెందిన పెద్దమనుషులు పోలీసుల వద్దకు వెళ్లి జాతర అయిపోయిందని, బంకును తిరిగి ఏర్పాటు చేసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు. అందుకు పోలీసులు సమ్మతించినట్లు గ్రామస్తులు తెలిపారు. దాదాపు 10 రోజుల క్రితం వెంకట నారాయణ ఆ స్థలంలో బంకును ఏర్పాటు చేసుకున్నాడు. ఇది సహించలేని గ్రామ టీడీపీ నాయకులు వైపాలెం పార్టీ నేతలతో కలిసి పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. దీంతో జేసీబీతో సహా గ్రామానికి వెళ్లిన పోలీసులు బంకుతో సహా వారసత్వంగా వస్తున్న దొడ్డిలోని గడ్డివామి, ఆ పక్కన ఉన్న పేడ దిబ్బను ధ్వంసం చేయించారు. బంకును మరోసారి ఏర్పాటు చేసుకుంటాడన్న ఉద్దేశంతో రేకులను ముక్కలు చేయించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని బెదిరించారు.

ఎందుకింత అత్యుత్సాహం?

గ్రామ కంఠం స్థలానికి హక్కుదారు ఎవరో నిర్ణయించాల్సింది రెవెన్యూ అధికారులు. కానీ పోలీసులు సొంత నిర్ణయం తీసుకుని తీసుకుని ఏకపక్షంగా వ్యవహరించడం గ్రామంలో చిచ్చు రాజేసింది. బంకు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పిన పోలీసులే అత్యుత్సాహం ప్రదర్శించి ధ్వంస రచనకు పూనుకోవడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సింహ వాహనంపై శ్రీవారు


సింహ వాహనంపై దర్శనమిస్తున్న వెంకటేశ్వర స్వామి

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం సింహ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై శ్రీవారిని ఊరేగించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, ఉభయదాతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు, రమణాచార్యులు, సింహాద్రిచార్యులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని ఈఓ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీ దామోదర్‌కు బాధితుల ఫిర్యాదు

ఒంగోలు టౌన్: సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు భారీగా డబ్బు గుంజి మోసం చేసిన వైనంపై ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడుకు చెందిన ఒక వ్యక్తి ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తనతోపాటుగా మరో ఆరుగురికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విడతలవారీగా రూ.22 లక్షలు వసూలు చేశారని వాపోయాడు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయి. నేరుగా బాధితులతో మాట్లాడిన ఎస్పీ దామోదర్ సమస్యల పూర్వాపరాలు తెలుసుకున్నారు. చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై పోలీసు అధికారులకు ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ సీఐ సుధాకర్, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, గ్రీవెన్స్ ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, మధుసూదనరావు, కమలాకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో మరికొన్ని..

- ఒంగోలు నగరంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో ప్లాటు ఇప్పిస్తానంటూ అడ్వాన్స్ పేరుతో రూ.21 లక్షలు తీసుకుని తనకు కాకుండా మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశాడని రాంనగర్‌కు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- కరవదికి చెందిన ఒక వ్యక్తి నుంచి పేర్నమిట్టకు చెందిన వ్యక్తి హ్యుందాయ్ కారును కొనుగోలు చేశాడు. లక్ష రుపాయల నగదు ఇచ్చి మిగతా డబ్బు ఈఎంఐ ద్వారా కడతానని చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడని బాధితుడు ఫిర్యాదు చేశారు.

నాలుగు పొగాకు బ్యారన్ల దగ్ధం

- రూ.40 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రమాదవశాత్తూ పొగాకు జారి మొద్దు గొట్టంపై పడటంతో పక్కపక్కనే ఉన్న నాలుగు పొగాకు బ్యారన్లు దగ్ధమై సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన జరుగుమల్లి మండలం రామచంద్రాపురంలో సోమవారం చోటుచేసుకుంది. టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన రావి నాగేశ్వరరావుకు పొగాకు బ్యారన్‌లో పొగాకు కాలుస్తుండగా, ప్రమాదవశాత్తూ ఆకు జారి మొద్దు గొట్టంపై పడి మంటలు చెలరేగి బ్యారన్ తగలబడింది. పక్కనే ఉన్న మరో మూడు బ్యారన్లకు కూడా మంటలు అంటుకుని తగలబడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పడంతో ఒక బ్యారన్ సగం మాత్రమే తగలబడింది. బ్యారన్‌లతో పాటు ఆకు కూడా దగ్ధం కావడంతో బ్యారన్ల యజమానులు ఉన్నం వెంకట్రావు, రావి ఆదిలక్ష్మి, రావి ఆదెమ్మ, నేతి మాలకొండయ్య, నర్రా శ్రీనివాసరావు, నర్రా మురళి, పావులూరి రామారావు, పావులూరి వెంకటేశ్వర్లుకు సుమారు రూ.40 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది మాత్రం రూ.21 లక్షల విలువ గల సామగ్రి కాపాడామని, కేవలం రూ.9 లక్షల సామగ్రికి మాత్రమే నష్టం జరిగిందని చెబుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది బి.సత్యన్నారాయణ, టి.బాలకృష్ణ, డి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండపి అగ్నిమాపక సిబ్బంది నిర్లక్ష్యం...

కొండపి అగ్నిమాపక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బ్యారన్ల దగ్ధం సంఘటనలో భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు పొగాకు రైతులు ఆరోపిస్తున్నారు. సంఘటన జరిగిన రామచంద్రాపురం కొండపి అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి వస్తుంది. దీంతో రైతులు ముందుగా కొండపి అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి చెప్పారు. కానీ, సిబ్బంది స్పందించకపోవడంతో చివరికి టంగుటూరు సిబ్బందికి సమాచారం అందించారు. టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పేలోపు మరో రెండు బ్యారన్‌లు దగ్ధమైనట్లు రైతులు చెబుతున్నారు. కొండపి అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి ఉంటే రెండు బ్యారన్లయినా దక్కి ఉండేవని అంటున్నారు.